## ఆదర్శనీయురాలు డొక్కా సీతమ్మ



సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్త

ముషీరాబాద్, అక్టోబర్ 13: గోదావరి జిల్లాల్లో నిత్యం వేలాది మంది అనాథలు, పేదలకు అన్నంపెట్టిన గొప్ప మానవతా మూర్తి డొక్కా సీతమ్మ అని పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా శుక్రవారం ప్రముఖ సంఘ సేవకురాలు డొక్కా సీతమ్మ సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప్పల శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిథిగా పాల్గొని డొక్కా సీతమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హాస్యావధాని శంకర నారాయణ, వైఎస్ఆర్ మూర్తి, శ్రీమణి తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన నాట్య ప్రదర్శన




పురస్కార గ్రహీతలతో పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త

ముషీరాబాద్, అక్టోబర్ 13: శ్రీవాగ్దేవి నాట్యస్థల్ కూచిపూడి విద్యాలయం వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో నిర్వహించిన నాట్య ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. నాట్యస్థల్ కూచిపూడి విద్యాలయ చిన్నారులు రామాయణ శబ్దం, భామా కలాపం, తరంగం అంశాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ వేడుకల్లో పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులను అభినందించి, పురస్కారాలను అందజేశారు. ఆచార్య టి.గౌరీ శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాట్య గురువు శైలజ వడ్డానం, విజయలక్ష్మి, శివాజీ, మోహన్, జి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గర్ల్స్ హాస్టల్‌లో విద్యార్థిని అనుమానాస్పద మృతి

చిక్కడపల్లి, అక్టోబర్13 : చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధి అశోక్ నగర్‌లోని బృందావన్ గర్ల్స్ హాస్టల్‌లో ఓ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలు వరంగల్ జిల్లాకు చెందిన ప్రవల్లికగా గుర్తించారు. చిక్కడపల్లి పోలీసులు క్లూస్ టీమ్‌తో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘటన నేపథ్యంలో అశోక్‌నగర్‌లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు ప్రవల్లిక ఆత్మహత్యకు గల కారణాలను సేకరిస్తున్నారు.

## ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి



ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా శాఖల ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకోవాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మిగౌడ్ కోరారు.శుక్రవారం వెంకటస్వామి నగర్ బస్తీలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జి.రామన్‌గౌడ్,మహేష్,జాకీ,మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

– హిమాయత్‌నగర్,అక్టోబర్13

# రేపటి నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు

- కనకాల కట్టమైసమ్మ ఆలయ ధర్మకర్త, చైర్మన్ జి.గౌతమ్ వెల్లడి

కవాడిగూడ/చిక్కడపల్లి, అక్టోబర్ 13 : లోయర్ ట్యాంక్‌బండ్‌పై ఉన్న కనకాల కట్టమైసమ్మ దేవాలయంలో ఈనెల 15 నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు దేవాలయ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ జి.గౌతమ్ కుమార్‌పటేల్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం దేవాలయ ఈవో వీఎస్‌వీ. సత్యనారాయణ, ప్రధాన అర్చకులు సాత్విక్‌శర్మలతో కలిసి ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగు వందల సంవత్సరాల చరిత్ర కలిగిన కట్టమైసమ్మ అమ్మవారు ఎంతో మహిమ కలిగినదని, అమ్మవారికి ప్రతి సంవత్సరం విశేషంగా దసరా ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 15న ప్రారంభం అయ్యే ఈ శరన్నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 23న ముగుస్తాయని తెలిపారు. నవరాత్రి ఉత్సవాలలో అమ్మవారికి ప్రతినిత్యం పంచామృత అభిషేకంతో ప్రారంభం అయ్యి, విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు, సహస్ర నామార్చనలు, అన్న ప్రసాద వితరణ, ద్వారబంధనం తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో అర్చకులు రాజేశ్‌శర్మ, ఆలయ సిబ్బంది సత్యనారాయణ పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న దేవాలయ వ్యవస్థాపకులు, దేవాలయ ఈఓ తదితరులు

**చిక్కడపల్లి వేంకటేశ్వరాలయం లేన్‌లో..**

చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వర దేవాలయం లేన్‌లో నేతాజీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న అమ్మవారి మండపంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తామని అసోసియేషన్ అధ్యక్షుడు కందూరి కృష్ణ, మాజీ కార్పొరేటర్ పలుస బాల్‌రాజ్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం చిక్కడపల్లిలో నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వందన రాజ్‌గోపాల్, వికాశ్ చంద్ జైన్, వల్లబ్ జైన్, పి.హరీశ్‌గుప్తా, అనిల్‌కుమార్, శరత్ గుప్తా, చంద్రమోహన్ పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణ తదితరులు

## అక్రమంగా మద్యం విక్రయం.. ఇద్దరు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ యాదగిరి, సీఐ పిడమర్తి నరేశ్

చిక్కడపల్లి,అక్టోబర్ 13 : చిక్కడపల్లి ఫుట్‌పాత్‌పై అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను చిక్కడపల్లి పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా చిక్కడపల్లి ఏసీపీ ఏ యాదగిరి వివరాలను వెల్లడించారు. చిక్కడపల్లి ఫుట్‌పాత్‌పై అక్రమంగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని సమాచారం మేరకు దాడి చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా అక్రమంగా మద్యం అమ్ముతున్న శ్రీనివాస్, భాస్కర్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని వివరించారు. వారి వద్ద నుంచి 180 ఎం.ఎల్ గల 13 మద్యం బాటిల్స్, 90 ఎం. ఎల్ 60 బాటల్స్‌ను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది. చిక్కడపల్లి సీఐ పిడమర్తి నరేశ్, ఎస్.ఐ.నాగరాజ్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్లాట్ల రిజిస్ట్రేషన్లు ప్రారంభించాలి..



సమావేశంలో మాట్లాడుతున్న సాయికృష్ణానగర్ కాలనీవాసులు

చర్లపల్లి, అక్టోబర్ 13: చర్లపల్లి డివిజన్ శ్రీసాయి కృష్ణానగర్ కాలనీలోని ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీ అధ్యక్షుడు సింగిరెడ్డి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాలనీలో సరైన కారణం చెప్పకుండా రిజిస్ట్రేషన్ నిలిపివేయడంతో ప్రభు త్వ ఖజానాకు నష్టం వాటిల్లడంతో పాటు కాలనీవాసులు పలు ఇబ్బందులకు గురికావల్సి వస్తుందన్నారు. 2003 చర్లపల్లి డివిజన్ సర్వే నంబర్ 177లో 211 ప్లాట్లతో శ్రీసాయికృష్ణానగర్ కాలనీ ఏర్పడగా కొంత కాలంగా రిజిస్ట్రేషన్లు సక్రమంగా జరరుగగా సర్వే నంబర్ ప్రక్కన ప్రభుత్వ స్థలం ఉందని రిజిస్ట్రేషన్లు నిలిపివేశారని ఆయన అన్నారు. దీంతో బాధితులు కోర్టును ఆశ్రయించడంతో సర్వే నిర్వహించిన రెవిన్యూ అధికారులు ప్రభుత్వ స్థలం వైపుగా ఉన్న 39ప్లాటపై అభ్యంతరం తెలుపుతూ హైలెవల్ సర్వే నిర్వహించాలని సూచన చేశారు. అప్పటి నుంచి 39ప్లాట్ల రిజిస్ట్రేషన్లు తాత్కలింగా నిలిపివేసి మిగత ప్లాట్లకు యాథావిధిగా రిజిస్ట్రేషన్లు చేయవచ్చని రెవిన్యూ అధికారులు సబ్ రిజిస్టార్‌కు అర్డర్ కాపిని అందజేసిందని, కోర్టు సైతం రిజిస్ట్రేషన్ల ప్రక్రీయ యాధవిధిగా కొనసాగించాలని, ఆర్డర్ జారీ చేసినా మూడు నెలల నుంచి రిజిస్ట్రేషన్లను నిలిపివేశారని ఆయన తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పదించి రిజిస్ట్రేషన్లను యా ధావిధిగా సాగించాలని వారు కోరారు. ఈ విషయమై సబ్ రిజిస్ట్రార్‌ను వివరణ కోరగా సాయికృష్ణానగర్‌లో రిజిస్ట్రేషన్లు నిలిపివేసిన విషయం వాస్తవమేనని, రిజిస్ట్రేషన్లను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీవాసులు పాల్గొన్నారు.

## నిర్ణీత సమయంలోనే ధ్రువపత్రాలు జారీ



తాసీల్దార్ సంధ్యారాణి

చిక్కడపల్లి, అక్టోబర్ 13 : కుల, నివాస, ఆదాయ ఇతర సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు చేసుకున్న ప్రజలకు నిర్ణీత సమయంలో ధ్రువ పత్రాలను జారీ చేస్తున్నామని హిమాయత్ నగర్ తాసీల్దార్ డి.సంధ్యారాణి తెలిపారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలో హిమాయత్‌నగర్ మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండల పరిధిలో ప్రజలు కుల, నివాస ఇతర సర్టిఫికెట్ల దరఖాస్తులను చేసుకున్న వారందరికీ పరిశీలించిన అనంతరం నిర్ణీత సమయంలోనే వారికి ధ్రువపత్రాలను జారీ చేస్తున్నామని తెలిపారు. మీసేవ లో కానీ, మండల కార్యాలయం సిబ్బంది ఎలాంటి ఇబ్బందులకు గురి చేసినా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఆమె ప్రజలకు సూచించారు.

## ప్రజలు ఎన్నికల నిబంధనలు పాటించాలి



ఏసీపీ యాదగిరి

చిక్కడపల్లి, అక్టోబర్13 : ప్రజలు ఎన్నికల నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని చిక్కడపల్లి ఏసీపీ, నోడల్ ఆఫీసర్ ఏ యాదగిరి అన్నారు. శుక్రవారం సాయంత్రం చిక్కడపల్లి ఏసీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ సూచనలు పాటించాలన్నారు. 50 వేలకు మించిన డబ్లును రవాణా చేసే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాహనాల తనిఖీలు ముమ్మరం చేశామని, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా.. డబ్బుల పంపిణీ అరికట్టేందుకు మూడు ప్రత్యేక బృందాలు నియమించడం జరిగిందన్నారు. ప్రతి బృందంలో ఆరుగురు ఉంటారని వివరించారు. ప్రశాతంగా పోలింగ్ జరగే విధంగా అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మొత్తం పోలింగ్ కేంద్రాలు 274 ఉన్నాయని తెలిపారు. ఇందులో క్రిటికల్ పోలింగ్ బూత్‌లు 22 ఉన్నాయని తెలిపారు. ప్రతి పోలీంగ్ కేంద్రంలో ఒక్క పోలీస్ సిబ్బంది, క్రిటకిల్ బూత్ వద్ద 1ప్లస్ 3 సిబ్బందిని నియమించడం జరుగుతుందని తెలిపారు.

## వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

కాచిగూడ, అక్టోబర్ 13: వాహనంపై వెళ్తున్న వ్యక్తిని రైల్వే గూడ్స్ వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలైన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై హెచ్. నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. హర్రాస్‌పెంట ప్రాంతానికి చెందిన నర్సింగ్‌రావు. శుక్రవారం చాదర్‌ఘాట్ నుంచి నింబోలిఅడ్డా వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదే సమయంలో రైల్వే గూడ్స్ వాహనం డ్రైవర్ నర్సింగ్‌రావును ఢీకొనడంతో ఆయన కాళ్లకు తీవ్ర గాయాలైనవి. కల్పన కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రైల్వే గూడ్స్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.